# అదృష్టవంతుడు

కె. రమణమ్మ

రోడ్డుమీద కార్లు పరుగెడుతున్నాయి.

తొంటొల్లా బస్సులు పరుగెడుతున్నాయి.

అప్పన్న రిక్షా పరుగెడుతున్నది.

అంతకన్నా వేగంగా పరుగెడుతున్నాయి అప్పన్న ఆలోచనలు

అప్పన్న కొడుక్కి మూడురోజుల నుంచి విష్మ తెలియనిజ్వరం. రాత్రినుంచి మూసిన కన్ను తెరవలేదు. ఒకటే కలవరింతలు. కొడుకును గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసి కెళదామనుకున్నాడు. అక్కడ తనను గుర్తించేవారులేరని ఉదయాన్నే ప్రయివేటు హాస్పిటల్‌కు తీసికెళ్ళేడు. డాక్టర్ పిల్లాడిని చూడకుండానే ముందు ఫీజు తెచ్చేవా అని గేడు. "నేమబాబు! బేగి నా కొడుకును సూడండి మీరుణం వుంచుకోను ఎట్టాగైనా రేపటికి మి ఫీజు తెచ్చియిస్తాను బాబు" అప్పన్న ఎంతో సేపు బ్రతిమాలాడు.

"లాభం లేదోయ్. ఇలాంటి కేసులు చూస్తే నేను హాస్పిటల్ ఎత్తేయ వలసి వస్తుంది. ఫీజు తెచ్చాకే వైద్యం సంగతి. వెళ్ళు" ఇంకా అప్పన్న అక్కడనుంచి కదల కుండా ఆశగా డాక్టర్‌వైపు చూస్తూ వుంటే "బాయ్! అతనిని బయటకు పంపించు" ప్యూన్‌ను పిలిచి చిరాగ్గా అన్నాడు. తను ఎన్నివిధాల బ్రతిమిలాడిన లాభం లేక పోయింది. ఇంతలో ఏదో ఖరీదైన కేసు రావడంతో వాళ్ళను ప్రక్కన కూర్చో బెట్టుకుని ఆప్యాయంగా కేసు వివరాలడుగుతున్నాడు. ఎప్పటికైనా జాలిదలచి డాక్టర్ చూస్తాడేమోనన్న ఆశతో కొడుకును పెట్టుకుని బయట బల్లమీద కూర్చున్నాడు అప్పన్న.

మరో అర్ధగంటకు తనవైపైనా చూడకుండా హడావిడిగా ఏదో కేసు చూడటానికి కారెక్కి వెళ్ళిపోయాడు డాక్టర్.

ఈ రోజు రిక్షాతొక్కి డబ్బు సంపాదించి కొడుక్కి మందిప్పించాలి. కొడుకు జ్వరం నయంచేసుకోవాలి మనసులో నిశ్చయించు కున్నాడు అప్పన్న.

మెయిల్ వచ్చేవేళయింది ఏవైనా బేరాలు తగలొచ్చు అనుకుంటూ రిక్షాను స్టేషన్ వైపు పోనిచ్చేడు.

"ఏటప్పన్నా టేషన్‌కేనా ఎళతూంట మెయిల్ వచ్చి ఎళ్ళిపోయి శానా సేపయింది" దారిలో ఎదురై చెప్పేడు గురవయ్య.

కొడుకు గొడవలో పడి మనస్థిమితం లేక మెయిల్ వచ్చేటైము మరచి పోయాడు అప్పన్న. ఏదో ఆతృతలో స్టేషన్‌కు తొక్కు కొచ్చేస్తున్నాడు

అప్పన్న వుత్సాహమంతా నీరు కారి పోయింది.

ఏటో నా దురదుష్టం. పొద్దుటకాడ నుంచి ఒక్క బేరం రానేదు అనుకుంటూ నీరసంగా రిక్షాను బస్‌స్టాండు వైపు మళ్ళించేడు.

"ఏవోయ్ రిక్షా కడతావా?"

"కడతాను బాబుగారు."

ఆ వ్యక్తి వెళ్ళవలసినచోటు చెప్పేను.

అప్పన్న రెండు రూపాయలడిగేడు.

"లేదోయ్. రూపాయిన్నర కన్నా ఎక్కువియ్యలేను."

అప్పన్న ఆలోచనలో పడిపోయేడు.

చేతితో బ్యాగ్‌ను పట్టుకొని ఆ వ్యక్తి అక్కడనుంచి ముందుకి నాలుగడుగులు వేశాడు.

అప్పన్న మళ్లా కలయచూశాడు. తను వచ్చేసరికే బస్సులన్నీ వెళ్ళిపోయాయేమో. పాసింజర్సు ఒక్కరూ లేరు. తనకు మరో బేరం వచ్చే సూచనలేమీ కనిపించలేదు.

ఈ బేరం కాస్తా వదులుకుంటే రూపాయిన్నర అయినా తనకు దక్కదని గిట్టుబాటు అవకపోయినా "బోనీ బేరం రండి బాబుగారూ" అన్నాడు.

ఆ వ్యక్తి వచ్చి రిక్షాలో కూర్చున్నాడు. రిక్షా కదిలింది.

ఒక ఫర్లాంగు తొక్కేసరికి అప్పన్నకు అలసట వచ్చేసింది. ఉదయం నుంచి టీ నీళ్ళు నోట్లో పోసుకోలేదేమో. కళ్ళు తిరిగినట్లయింది. చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది. రిక్షా సోములు టీ కొట్లో కెళ్ళి గ్లాసుడు నీళ్ళు తెచ్చుకొని ముఖం కడుక్కొని తడిసిన బనీను పిండుకొని మళ్ళీ తొడిగేసుకున్నాడు. సోములును గ్లాసుడు టీ అప్పడిగి ఒక్క గుక్కలో తాగాడు. మూడు రోజులనుంచి భార్య, తల్లి తిండి లేక ఆకలితో మాడిపోతున్నారు. వాళ్ళు జ్ఞాపకం వచ్చి మనస్సు దోలా అయిపోయి మరి తాగబుద్ధి కాలేదు. అయినా తాగకపోతే తను రిక్షా తొక్కలేడు. తొక్కకపోతే దినం గడవదు. అందుకే ఏమీ ఆలోచించకుండా రెండు గుక్కల్లో టీ తాగి బయటకొచ్చేశాడు.

"ఎక్కడపడితే అక్కడ ఆపేస్తే ఎలా? త్వరగా పోనీ. అవతల నాకర్జంటు పనుంది." రిక్షాలో వున్న వ్యక్తి విసుక్కున్నాడు.

"అట్లాగే బాబు" అంటూ మంచి స్పీడుగా లాగించేడు అప్పన్న.

పెద్ద బంగళా ముందు ఆగింది రిక్షా.

ఆ ఆసామి, రిక్షాదిగి చిల్లర లెక్కపెట్టి, "రూపాయి నలభై పైసలే వున్నాయి. నీదగ్గర ఐదురూపాయల చిల్లరుందా" అడిగేరు.

"లేదు బాబు." నోటు మారుద్దామంటే చుట్టు ప్రక్కల ఏ దుకాణాలు లేవు. తను త్వరగా వెళ్ళి కొడుక్కు మందులు కొనాలి. అప్పన్నలో ఆతృతతో కూడిన తొందర ఎక్కువయింది. "ఉన్న చిల్లరే యిప్పించండి బాబు నా అవసరం ఏటిసేత్తాం. ఈ రోజు [illegible] బాగోలేదు" అంటూ పైసలు తీసుకుని రిక్షా తొక్కుకుంటూ అక్కడినుంచి కదిలిపోయేడు.

"ఏయ్, రిక్షా రామనగర్ కొస్తావా?"

అప్పన్న రిక్షా దిగి ఆలోచించేడు. తన గుడిసె కూడా అటు వైపే. తాను వెళ్ళే దార్లోనే కదా వాళ్ళదగ్గర కొచ్చిన బేరం పోగొట్టుకోవడమెందుకు? అనుకొని "కూర్చోండి బాబు ఎంతిస్తారు?" అన్నాడు.

"అర్ధరూపాయ."

అప్పన్న తలగోక్కొని "రండి బాబు ఎక్కండి" అన్నాడు.

ఈసారి అప్పన్న ఉషారుగా రిక్షాను తొక్కుతున్నాడు. కార్లను, ఆటోలను అన్నిటిని దాటుకుని ముందుకు దూసుకు పోతున్నది రిక్షా.

తనకాడ వున్నది రూపాయి నలభై పైసలు. ఈ అయ్యగారిచ్చేది అర్ధరూపాయి. మొత్తం కలిపి నలభై తక్కువ రెండురూపాయలౌతాది. పిల్లాడికి ఈ డబ్బుతో రాత్రికి గొట్టాలు కొనేసి వేసేత్తాను. మానుగో నా సామిరంగా తెల్లారేకాడికి జొరం పోయి సక్కగా లేసి కూకుంటాడు. ఈదొక్కటి సేపుడే చిక్కు. అప్పన్న రిక్షా తొక్కుతూ ఏవేవో ఆలో

చెప్తున్నాడు.

"అప్పన్నా ముందు రిక్షా ఆపు."

అప్పన్న భయంతో రిక్షాను ప్రక్కకు మళ్ళించి ఆపుచేసేడు.

"ఏంరా. ఎన్నాళ్ళు నన్ను తప్పించుకు తిరుగుతావు. ముందు నా సొమ్ము నాకు పారేయ్. ఈ రోజు నీవు డబ్బియ్యందే నిన్నిక్కడనుంచి కదలనీయను." వస్తూనే రంగయ్య అప్పన్న దగ్గరగా వచ్చేడు.

"ఇప్పుడు నేను బాబయ్యా. ఒక్క వారం రోజులు గడువియ్యి. ఎట్టాగో అట్టాగ నీ అప్పు తీర్చేస్తా." అప్పన్న కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ బ్రతిమలాడేడు.

"లాభం లేదప్పన్నా. ఈ రోజు నాక్క నేను. ఒంట్లో ఏదో నలతగా వుంది. కోపమొస్తే మనిషిని కాను. త్వరగా పడేయి పోవాల...." కోపంతో గుర్రుగురిమి చూసేడు.

"కుర్రాడికి సుస్తీగా వుండాది. మందులు కొనాల, సచ్చి నీ కడుపున పుడతాను. నీకు పుణ్ణెముంటాది. ఈ సారి కాగేయ్ బాబూ" ఏడుస్తూ అమాంతం రంగయ్య కాళ్ళమీద పడిపోయేడు అప్పన్న.

"నీ కళ్ళబొల్లి ఏడుపులకు నేను నల్లబడి పోతాననుకున్నావా. నా దగ్గర వేషాలెయ్యకు ముందురాని" రంగయ్య రిక్షాకడ్డంగా నిలబడి పోయాడు.

రిక్షాలో కూర్చున్న వ్యక్తి భయపడి రిక్షా దిగి వెళ్ళిపోయేడు. అప్పన్న చేతులు నలుపుకుంటూ మౌనంగా వుండిపోయేడు.

"ఏం అప్పన్నా మర్యాదగా ఇస్తావా లేక...." కొట్టడానికి కర్ర పైకెత్తేడు రంగయ్య.

అప్పన్న ప్రాణం విసిగిపోయింది. "చచ్చినా నేను ఇవ్వను. ఏటిచేసుకుంటావో చేసుకో" ఉద్రిక్తంగా వచ్చింది సమాధానం.

అప్పన్న మొండితనంతో వెర్రికోపం వచ్చి అప్పన్న తలమీద కర్రతో బలంగా ఒక్క దెబ్బ వేసేడు రంగయ్య.

అంతే.. అప్పన్న తెలివివచ్చి చూసేసరికి రంగయ్య లేడు. జేబులో డబ్బుల్లేవు.

* * *

ఊర్లో అమ్మవారి పండుగలు జోరుగా సాగుతున్నాయి. రంగయ్య తప్పతాగి మైకంలో ఏదో వాగుతూ రోడ్డుమీద జోగుతూ నడుస్తూ వేస్తూ ముందు సందిలో తేలిపోతున్నాడు.

నడిరోడ్డుమీద అప్పన్న కొడుకు శవం. అప్పన్న నిప్పు కుండ పట్టుకుని ముందుగా నడుస్తున్నాడు.

"ఏంది అప్పన్నా పండగ రోజులు యేషాలు వేసేరా." అప్పన్న భుజం మీద చేయి వేసి ఆ శవం వైపు చూస్తూ అన్నాడు రంగయ్య.

"మా బతుకు అంతేనె తమలాటి వాళ్ళకు యేలాకోలంగా వుంటాది బాబు. నా కొడుకు సచ్చిపోనాడు" దుఃఖాన్ని ఆపుకోలేక పైమీది గుడ్డను నోటిలోకి కుక్కుకున్నాడు

"పాపం సచ్చిపోనాడా! పోన్లే, పండుగ రోజుల్లో సచ్చిపోతే స్వర్గానికెళతారట. నీ కొడుకు అదృష్టవంతుడు" త్రాగుడు మైకంలో ఏదో వాగుతూ మైకమెచ్చి పడిపోయాడు.

"నిజమే బాబు. బాగానే సెప్పేవు నా కొడుకు అదృష్టవంతుడు. ఈ కుళ్ళు పెపంచంలో బతకనేక యెళ్ళిపోనాడు. అయినా బతికుంటే ఈ దేశంలో యేటి సుఖ పడాల. సచ్చి బాగానే యెళ్ళిపోనాడు. నా కొడుకు అదృష్టవంతుడు.... "గట్టిగా నవ్వుతూ పిచ్చివాడిలా జుత్తు పీక్కున్నాడు అప్పన్న.